ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణిస్తున్నారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎస్‌ఎస్‌సీ పరీక్షల నేపథ్యంలో వరల్డ్ విజన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూతనందించేందుకు తీసుకొచ్చిన స్టడీ మెటీరియల్స్‌ను సోమవారం ఎమ్మెల్యే చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి అక్కడ చదువుతున్న విద్యార్థులకు అన్ని విధాలా సహాయ సహకారాలను అందజేయాలని సూచించారు. విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా చదువుకోవాలని తెలిపారు. సంస్థ సభ్యులు కృష్ణ, విజయ్‌కుమార్, నాయకులు రవి, ప్రకాష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వశక్తితోనే మహిళల ఆర్థిక ప్రగతి



మహిళలకు సూచనలు ఇస్తున్న బ్యాంకర్స్ గ్రూప్ చీఫ్ కో–ఆర్డినేటర్ లక్ష్మణ్‌రావు

సైదాబాద్: మహిళలు తమ స్వశక్తితోనే ఆర్థిక ప్రగతిని సాధించాలని భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూప్ చీఫ్ కో–ఆర్డినేటర్ ఆర్.లక్ష్మణ్‌రావు సూచించారు. సోమవారం ఐఎస్‌సదన్ డివిజన్ కృష్ణానగర్‌లోని కరుణశ్రీ సేవాసమితి వారి కారుణ్య సింధు ఆశ్రమంలో మహిళలకు 20 రోజులుగా నిర్వహిస్తున్న జూట్ బ్యాగ్‌ల తయారీ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిక్షణా తరగుతుల్లో మహిళలు నేర్చుకున్న విషయాలతో జూట్ బ్యాగుల తయారీలో నైపుణ్యం పెంచుకోవాలని చెప్పారు. 59వ వివాహ దినోత్సవం సందర్భంగా జూట్ బ్యాగుల శిక్షణకు అవసరమైన కుట్టు మిషన్లు, ఒక కంప్యూటర్, బ్యూటీషన్ వస్తు సామగ్రిని మహిళా గ్రూప్‌కు అందజేశారు. ఆర్.చంద్రమౌళి, రాజేందర్‌రెడ్డి సేవాసమితి అధ్యక్షుడు కడారి సత్యమూర్తి, కార్యదర్శి పుప్పాల వెంకటేశ్వరరావు, కోశాధికారి ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు సంత్ సేవాలాల్



సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఐఏఎస్ అధికారి భారతి లక్పతినాయక్ తదితరులు

హస్తినాపురం: బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సంత్‌సేవాలాల్ మహరాజ్ అందరికి ఆదర్శ ప్రాయుడని ఐఏఎస్ అధికారి భారతి లక్పతినాయక్ అన్నారు. సోమవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని కాటం పార్వతమ్మ ఎన్‌క్లేవ్ కాలనీలోని పార్కులో సంత్‌సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి వేడుకలను బంజారా జనతా సంఘం, ట్రైబల్‌స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు భిక్షపతినాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐఏఎస్ అధికారి భారతి లక్పతినాయక్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సేవాలాల్ జయంతి రోజున బంజారా ఉద్యోగులకు ప్రత్యేక సీఎల్ సెలవు ఇవ్వడం సంతోషకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వడ్త్య వెంకటేష్ నాయక్, జానకీరాం నాయక్, శ్రీరాం నాయక్, ధంజిలాల్ నాయక్, వసురాం నాయక్, కృష్ణ నాయక్, పాండు నాయక్, బిక్కు నాయక్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



హస్తినాపురం టీకేఆర్ రోడ్డుపై ఏరులై పారుతున్న మురుగు



భూపేశ్‌గుప్తానగర్ కాలనీలో..

మురుగు.. పరుగు

- రోడ్లపై ఏరులై పారుతున్న మురుగు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- టీకేఆర్ కాలేజీ రోడ్డుపై తరుచూ ప్రమాదాలు

ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేశ్ గుప్తానగర్ కాలనీ, రాజీవ్‌గాంధీనగర్‌కాలనీ, శ్రీరమణనగర్‌కాలనీల్లో గత ఏడాదిగా రోడ్లపై డ్రైనేజీ ఏరులై పారుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాదని ఆయాకాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని టీకేఆర్ కాలేజీ రోడ్డులో గత కొంతకాలంగా మురుగుతో దుర్గంధం వెదజల్లుతున్నా.. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- డివిజన్ పరిధిలోని నందనవనం, వాంబేకాలనీలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు కారణంగా ఈ మురుగు వస్తుందని రోడ్డుపై వెళ్లాలంటేనే ముక్కుమూసుకుని వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.
- ఈ రహదారిపై వాహనదారులు వెళ్లాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుందని చెబుతున్నారు. దీనిపై అధికారులకు పలుసార్లు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని ఆయాకాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను సత్వరమే పరిష్కరించాలని కోరుతున్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి..



హస్తినాపురం డివిజన్ పరిధిలోని టీకేర్ కాలేజీకి వెళ్లే రోడ్డుపై మురుగు ఏరులై పారుతుంది. ఈ సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులకు తమ గోడును వెల్లడించాం. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను సత్వరమే పరిష్కరించాలి.

– భరత్‌గౌడ్, శ్రీరమణకాలనీ

ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలి..



తాము గత కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న మురుగు సమస్యతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. నందనవనం, వాంబేకాలనీలో ఏర్పాటు చేసిన చెత్తడంపింగ్ యార్డు వల్ల మురుగు రోడ్లపై ఏరులై పారుతుంది. స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి.

– శ్రీధర్‌రావు, భూపేశ్‌గుప్తానగర్‌కాలనీ

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

హస్తినాపురం: ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారు జామున ఒకటిన్నర గంటల ప్రాంతంలో నగరంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన చింతకింది వినోద్ (23) ఇంజాపూర్‌లో తన మిత్రుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని తిరిగి నగరానికి వస్తుండగా.. ద్విచక్రవాహనం అదుపుతప్పి బీఎన్‌రెడ్డినగర్ దగ్గర డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వినోద్ తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108కు కాల్‌చేయడంతో చికిత్స నిమిత్తం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన శ్యామలాదేవి ఉత్సవాలు



ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ అరుణ, ఆలయ చైర్మన్ అమరేశ్వర్ తదితరులు

సైదాబాద్: లోకకల్యాణం కాంక్షిస్తూ.. జయదుర్గాదేవి ఆలయంలో శ్యామలాదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ కొరుడు అమరేశ్వర్ ప్రకటించారు. సైదాబాద్ డివిజన్ జీవన్‌జ్యోతి సంఘంలోని అమ్మవారి ఆలయంలో ఈనెల 10న ప్రారంభమైన ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో పురవీధులలో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి హారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ చైర్మన్ అమరేశ్వర్ మాట్లాడుతూ.. అమ్మవారి దీవెనలతో ప్రజలు అందరూ సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. వేడుకల్లో సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి, లతామా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ మాధవీలత కొంపెల్ల పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

దిల్‌సుఖ్‌నగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాలనీ ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్‌కేపురం డివిజన్ రోడ్డును కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యతతో కూడిన రోడ్లను వేయాలని ఆమె అధికారులకు సూచించారు. రోడ్లు, బస్తీలు, కాలనీల్లో రోడ్డు పనులు, ప్యాచ్‌వర్క్స్ పూర్తి చేసి కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. బీజేపీ నాయకులు, కాలనీ వాసులు తదితరులున్నారు.

సన్మానం



మన్సూరాబాద్: వనస్థలిపురం నూతన ఏసీపీగా నియమితులైన కాశీరెడ్డిని బీఆర్ఎస్ ఎల్‌బీనగర్ ఎస్సీసెల్ చైర్మన్ జోగురాములు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు సోమవారం కలిసి శాలువాతో సత్కరించి, సన్మానించారు.

కార్పొరేటర్‌కు పితృవియోగం



రంగ పాండు గుప్తా (ఫైల్)

చైతన్యపురి: చైతన్యపురి కార్పొరేటర్ రంగ నర్సింహ్మగుప్తా తండ్రి రంగ పాండు గుప్తా ఆదివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఆయన నివాసం రామకృష్ణాపురం డివిజన్ టెలిఫోన్‌కాలనీలో మృతి చెందారు. సోమవారం నాగోలు శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఆత్మరక్షణకు కరాటే చక్కని సాధనం



కాచిగూడ: ఆత్మరక్షణ కోసమే కాదూ.. ఆరోగ్యానికి కరాటే చక్కని సాధనమని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేశ్‌యాదవ్ అన్నారు. యమగుచి, షైక్వాండో అకాడమీ సీనియర్ మాస్టర్ విశ్వనాథం ఆధ్వర్యంలో సోమవారం కాచిగూడ లింగంపల్లిలో కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం అర్హత సాధించిన విద్యార్థులకు ధ్రువీకరణపత్రాలతో పాటు కలర్ గ్రేడింగ్ బెల్టులు ప్రదానం చేశారు.



శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్నగౌడ్



శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్



శివాజీ జయంతి ఉత్సవాల్లో చిలుక ఉపేందర్‌రెడ్డి తదితరులు

ధీరత్వానికి ప్రతీక శివాజీ మహారాజ్

దిల్‌సుఖ్‌నగర్: హైందవ సామ్రాజ్య స్థాపకుడు, దేశభక్తి, దైవభక్తి ధీరత్వానికి మారుపేరు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని రాష్ట్రయువజన సంఘం కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆర్‌కేపురం డివిజన్ సిరినగర్ కాలనీలో గణేష్ మహారాజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళ్యాణ్, స్వరూప్, తీష్, భవానీ శవిధర్, రాహుల్, కాలనీవాసులు పాల్గొన్నారు

సైదాబాద్: నేటి యువత ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని బీజేవైఎం స్టేట్ అడిషనల్ సెక్రటరీ రమణ్‌సింగ్ అన్నారు. ఛత్రపతి శివాజీ 394వ జయంతి వేడుకలు సోమవారం ఐఎస్‌సదన్, సైదాబాద్ డివిజన్‌ల పరిధిలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సైదాబాద్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో యువకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



శోభయాత్రను ప్రారంభిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ఓల్డ్‌మలక్‌పేటలో...

కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోచమ్మ దేవాలయం వద్ద శివాజీ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు చొకి రవికుమార్, బాబు శ్రీనివాస్, ఆకుల రాజు, చీపురు రాజారావు పాల్గొన్నారు.

మూసారాంబాగ్‌లో...

డివిజన్ బీజేపీ జనరల్ సెక్రటరీ రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో శివాజీ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. బీజేపీ నాయకులు బొక్కా మధుసూదన్‌రెడ్డి, లింగాల హరిగౌడ్ పాల్గొన్నారు.

లింగోజిగూడ: నాగోలు డివిజన్ పరిధిలో హనుమాన్ దేవాలయం నుంచి శివాజీ మహారాజ్ సంఘం ఆధ్వర్యంలో శోభయాత్ర నిర్వహించారు. ఉప్పల శ్రీనివాస్ గుప్తా ముఖ్యఅతిథిగా హజరై శోభయాత్రను ప్రారంభించారు. సురేందర్ యాదవ్, రాజిరెడ్డి, యాదిలాల్, చిరంజీవి, కిరణ్‌యాదవ్, ప్రశాంత్‌గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం..

శివాజీని యువత ఆదర్శంగా తీసుకోని ముందుకు వెళ్లాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ సూచించారు. నాయకులు దాసరి మల్లేష్, అశోక్ తదితరులున్నారు.

మన్సూరాబాద్: మన్సూరాబాద్ జడ్జెస్‌కాలనీ ఫెజ్–1లోని ఛత్రపతి శివాజీ విగ్రహానికి టీపీసీసీ ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్నగౌడ్, వాసవి క్లబ్ మన్సూరాబాద్ అధ్యక్షుడు మొరిశెట్టి సంతోష్‌కుమార్‌లు హాజరై పూలమాల వేసి నివాళులర్పించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంజయ్యగౌడ్, గాలయ్య, చింతల యాదయ్య, భిక్షపతిసాగర్, నాయకులు ఆలూరి పుల్లయ్య, జైపాల్‌రెడ్డి, పృథ్వీరాజ్, మోహన్‌రెడ్డి, మహేందర్, అశోక్, రవి తదితరులున్నారు. చైతన్యపురిలోని ఛత్రపతి శివాజీ విగ్రహానికి టీపీసీసీ ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.



బీజేపీ నేతలు రమణ్‌సింగ్, సుభాష్‌చందర్జీ, రవీందర్‌రెడ్డి



మూసారాంబాగ్‌లో డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్



నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు కిలో.రూ.ల్లో టమాటా లోకల్ రూ.13, వంకాయ 18, బెండకాయ 50, పచ్చిమిర్చి 50, కాకర 52, బీర 40, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 28, క్యారెట్ 23. దొండ 45, ఆలు 23, ఉల్లి 19, గోకర 45, దోస 21, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 45, అర్వి 50, మునగ 55, చిలగడదుంప 60, బీట్‌రూట్ రూ.23, కీర 26, ఫ్రెంచ్‌బీన్స్ 45, కాప్సికమ్ రూ.55గా ఉన్నాయి. ఈ ధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా రామకృష్ణ



హయత్‌నగర్: హయత్‌నగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా జి.రామకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఎల్‌బీనగర్ సీసీఎస్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన వెంకటేశ్వర్లు గత నెల 26న బదిలీపై మహేశ్వరం వెళ్లారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ కూడా అదే రోజు బదిలీ అయినా.. ఇక్కడి నుంచి రిలీవ్ కాకుండా ఇప్పటిదాకా పోలీస్‌స్టేషన్ బాధ్యతలు నిర్వహించారు. రామకృష్ణ బాధ్యతలు తీసుకోవడంతో నిరంజన్ ఎస్‌టీటీ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వెళ్లారు.

'ప్రజావాణి'కి ఫిర్యాదులు



ప్రజావాణిలో హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్య

ఎల్‌బీనగర్: ప్రజావాణిలో భాగంగా హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో సోమవారం మూడు ఫిర్యాదులు రాగా.. వాటిలో రెండు టౌన్‌ప్లానింగ్, ఒకటి ఇంజినీరింగ్‌పై వచ్చాయని సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్య తెలిపారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని డీసీ జకియా సుల్తానా తెలిపారు.

వైభవంగా అభయాంజనేయ విగ్రహ ప్రాణప్రతిష్ఠ

- హంపీ పీఠాధిపతి విద్యారణ్యభారతి చేతుల మీదిగా ప్రతిష్ఠ
- పూజలకు హాజరైన సినీనటి, యాంకర్ అనసూయ



పూజలు నిర్వహిస్తున్న విద్యారణ్య భారతి



బడంగ్‌పేట్: బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో సామల పాపిరెడ్డి గార్డెన్ వద్ద నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో అభయాంజనేయస్వామి గణపతి నవగ్రహ శిఖర ధ్వజ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రయం సోమవారం హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతి చేతుల మీదిగా ప్రాణప్రతిష్ఠ చేశారు. భక్తిశ్రద్ధలతో వేద మంత్రాల మధ్య జరిగిన కార్యక్రమానికి సినీనటి, యాంకర్ అనసూయ భరద్వాజ, ఆకాశ్‌పూరి, అను రావిపూడి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, బడంగ్‌పేట మేయర్ పారిజాతారెడ్డి, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, మాజీ ఎంపీపీ రంగారెడ్డి, కుటుంబసభ్యులు సామల ప్రవీణ్‌రెడ్డి, యజ్ఞయాగాదులు, హోమాలు నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అయోధ్య రామ మందిరంలోని శ్రీరాముడి విగ్రహాన్ని రూపొందించిన కృష్ణశిలతోనే ఈ అభయాంజనేయ స్వామి విగ్రహం, దేవాలయ గర్భగుడిని కూడా నిర్మించడం విశేషం. అంతేకాక గుడి ప్రాంగణంలోని వినాయక విగ్రహం 4 దశాబ్దాల పురాతనమైనది కావడం మరో విశేషం.

'సైబర్ సెక్యూరిటీ' శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

కాచిగూడ: నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి కోర్సుల్లో శిక్షణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విమలా రెడ్డి సోమవారం తెలిపారు. సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్, పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ అభ్యర్థులు అర్హులు. కోర్సులో చేరేందుకు ఫిబ్రవరి 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు సెల్: 78931 41797లో సంప్రదించవచ్చు.

చనిపోతూ.. ముగ్గురి జీవితాల్లో వెలుగులు

- బ్రెయిన్‌డెడ్ అయిన పోలీస్ కానిస్టేబుల్



శ్యాంసుందర్ (ఫైల్)

మన్సూరాబాద్: తాను చనిపోతూ.. మరో ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపాడో పోలీస్ కానిస్టేబుల్. జీవన్‌ధాన్ ప్రతినిధి తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం పోలకంపల్లి, నాగంపల్లికి చెందిన మేకల శ్యాంసుందర్ (41) పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గత నెల 27న తన నివాసంలో ఆకస్మాత్తుగా కుప్పకూలి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబసభ్యులు వెంటనే ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. 22 రోజుల పాటు చికిత్స అందించినా.. చికిత్సకు స్పందించడం లేదు. దీంతో ఈనెల 18న బ్రెయిన్‌డెడ్ అయినట్లు కామినేని వైద్యులు ప్రకటించారు. సమాచారం అందుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు శ్యాంసుందర్ తండ్రి వెంకయ్య, భార్య లిఖితకు అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో లివర్, రెండు కారిడ్నీయాలను దానం చేసేందుకు అతడి కుటుంబసభ్యులు అంగీకరించి అవయవాలను దానం చేశారు.

రైలు ఢీకొని మహిళ మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాలు.. బుద్వేల్–ఉందానగర్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారీ కేసు నమోదు చేశారు.